దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

'ప్రజావాణి' దరఖాస్తులను పరిష్కరించాలి

జనగామ, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కేంద్రానికి చెందిన రైతు కే నరేందర్ తనకు రుణ మాఫీ కాలేదని ఫిర్యాదు చేశారు. లింగాలఘనపురం మండలం కుందారానికి చెందిన గంగసాని రంజిత్‌రెడ్డి తనకున్న 14 ఎకరాల 20 గుంటల భూమిని కౌలు పేరుతో సాగు చేస్తున్న వారు భూకబ్జాకు పాల్పడ్డారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నెమలిగొండకు చెందిన నిమ్మ వెంకట్ రెడ్డి, ఉరుమడ్ల బుచ్చమ్మ, పెద్దపుండ్ర వెంకట్‌రెడ్డి తదితరులు తమ ఇళ్ల పైనుంచి ఉన్న విద్యుత్ సర్వీస్ లైన్ తొలగించాలని కోరారు. రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌కు చెందిన విద్యాసాగర్ తన 5 గుంటల భూమిని కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని ఫిర్యాదు చేశారు. లింగాలఘనపురం మండలం పటేల్‌గూడెం మాజీ సర్పంచ్ సీడీఎఫ్ నిధులతో వేసిన సీసీ రోడ్డును ధ్వంసం చేశారని ఫిర్యాదు చేశారు. వివిధ అంశాలపై కలెక్టర్ 10 దరఖాస్తులు స్వీకరించారు. వీటి పరిష్కారం కోసం తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, డీఆర్‌డీవో వసంత, డీఈవో రాము, జిల్లా పౌర సరఫరాల అధికారిణి రోజారాణి, డీబ్ల్యూవో జయంతి, డీఏవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని దివ్యాంగుల విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరంలో ప్రీ-మెట్రిక్ స్కాలర్ షిప్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్ షిప్‌తో పాటు టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ పథకంలో భాగంగా 'నేషనల్ స్కాలర్ షిప్'లను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు అందించాలని జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్ భాషా తెలిపారు. నేషనల్ స్కాలర్ షిప్ 2024-25లో భాగంగా ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్ షిప్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్ షిప్ కోసం www.depwd.gov.in, ఆన్‌లైన్ పోర్టల్: https://schoolarahip gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత దరఖాస్తులను ఆన్ లైన్ పోర్టల్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు రైతునేస్తంపై వీడియో కాన్ఫరెన్స్

జఫర్‌గడ్, ఆగస్టు 19 : రైతునేస్తంపై మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఏఈవో శిరీషా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వరి పంటలో చీడ పీడల నివారణ, యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో నేరుగా మాట్లాడుతారని శిరీషా తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆమె కోరారు.

50 ఏళ్ల తర్వాత తమ్ముడికి రాఖీ కట్టిన అక్క

రాఖీ పౌర్ణమి రోజు ఆత్మీయతను చాటిన సోదరి..

తమ్ముడికి రాఖీ కడుతున్న రాజమ్మ

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 19 : ఐదు దశాబ్దాల తర్వాత సోదరుడికి రాఖీ కట్టిన చెల్లెలు ఉదంతం మండలంలోని విశ్వనాథపురంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. విశ్వనాథపురం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ దాసు నర్సయ్య అక్క తౌటి రాజమ్మ వివాహం ఐదు దశాబ్దాల క్రితం జరిగింది. ప్రస్తుతం రాజమ్మ జనగామలో ఉంటున్నది. కొన్ని కారణాలతో సోదరుడికి రాఖీ కట్టడానికి రాలేదు. ఈ క్రమంలో సోమవారం రాజమ్మ విశ్వనాథపురం వచ్చి తమ్ముడు నర్సయ్యకు రాఖీ కట్టింది. దీంతో నర్సయ్య కళ్లలో ఆనంద బాష్పాలు వచ్చాయి. ఇన్నేళ్లు ఆత్మీయతకు దూరం కావడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ఇకపై అనుబంధాన్ని వదులుకోబోమని వారు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-325790-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

జిల్లాలో మోస్తరు వర్షం..

జనగామ, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) : పొద్దంతా వేసవిని తలపించే ఎండతో ఉక్కపోత.. వానకాలంలోనూ ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లకు పని తప్పడంలేదు. సాధారణంగా ప్రతి ఏటా జూన్ రెండోవారం నుంచి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతూ వర్షాకాలం ఆరంభం అవుతుంది. కానీ ఈసీజన్‌లో భారీ వర్షం కురిసిన దాఖాలాలు లేవు. చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. అడపదడపా కురిసిన వానలు వానకాలం పంటలకు జీవం పోస్తున్నాయి. కాగా, ఆదివారం రాత్రి, సోమవారం సాయంత్రం జిల్లాలో మోస్తరు వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఐనవోలు, ఆగస్టు 19 : అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పంథిని శారద పౌల్ట్రీ ఫారం లో అక్రమంగా రేషన్ బి య్యం నిల్వ ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లుగా తెలిపారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి బియ్యాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించి, పౌల్ట్రీ యాజమానిపై కేసు నమోదు చేసిన్నట్లు చెప్పారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సోదాల్లో పోలీసులు శ్రీనివాస్, హేమకుమార్ తదితరులు ఉన్నారు.

ఆత్మీయత, అనురాగానికి ప్రతీక రాఖీ పౌర్ణమి

- ఆడబిడ్డలకు అండగా నిలవాలి
- జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా; అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు రాఖీలు కడుతున్న బాలసదనం చిన్నారులు

జనగామ, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) :ఆత్మీయత, అనురాగానికి ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందని, ఈ నేపథ్యంలో ఆడబిడ్డలకు అందరూ రక్షణగా ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం మహిళా శిశు సంక్షేమశాఖ బాలసదనం ఆశ్రమంలోని చిన్నారులు కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్ , రోహిత్‌సింగ్‌తో కలిసి రక్షాబంధన్ వేడుకలను ఆహ్లాదంగా జరుపుకున్నారు. 'బేటీ బచావో.. బేటీ పడావో' నినాదంతో రాఖీలు కట్టారు. బాల సదనం చిన్నారులను కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఆప్యాయంగా పలకరించి స్వీట్స్ పంపిణీ చేశారు. రక్షాబంధన్ విశిష్టతను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, జిల్లా సంక్షేమ అధికారిని జయంతి, జిల్లా బాల పరిరక్షణ అధికారి ఎల్ రవికాంత్, బాల సదనం సూపరింటెండెంట్ వేరోనిక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా 'రక్షా బంధన్'..

అన్నా చెల్లెల్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు జిల్లాలో సోమవారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఆడబిడ్డలు, సోదరులతో లోగిళ్లు సందడిగా మారాయి. రాఖీ కట్టిన అక్కా చెల్లెళ్లకు అన్నాదమ్ములు కట్నకానుకలు అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. స్నేహానికి ప్రతిరూపమైన రాఖీలను చిన్ననాటి మిత్రులకు సైతం మతాలకు అతీతంగా కట్టి పండుగ చేసుకున్నారు. రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మిఠాయి, పూలు, వస్త్ర దుకాణాల్లో వ్యాపారం జోరుగా సాగింది. జిల్లాతోపాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపించింది. మరోవైపు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

బచ్చన్నపేటలో జంజిరాలు వేసుకుంటున్న పద్మశాలీలు

మార్కండేయస్వామి ఆలయంలో పూజలు

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని శివభక్త మార్కండేయస్వామి ఆలయంలో పద్మశాలీ కులస్తులు సోమవారం యజ్ఞోపవీత ధారణ నిర్వహించారు. పూజారి గణపురం ఆనంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి సుమారు రెండు వందల మందికి కొత్త జంజిరాలు వేయించారు. ఈ కార్యక్రమంలో మచ్చ నరేందర్, బేతి కృష్ణమూర్తి, పెండెం నాగేశ్, మంగళంపల్లి కృష్ణమూర్తి, గుండ కేశవులు, వేముల మురళి, వేముల సత్యనారాయణ, గణపురం నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రుణమాఫీ కానీ రైతులతో మహాధర్నా

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందునాయక్

జనగామ, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీ కాని రైతులతో కలిసి ఈనెల 20న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందునాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 12 మండలాల పరిధిలోని రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చి తొమ్మిది నెలలు గడించిందన్నారు. ఇప్పటి వరకు మూడు దఫాలుగా రుణమాఫీ నిధులను జమ చేశామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా అందరికీ అమలు కాలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 47 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్లు రుణమాఫీకి నిధులు అవసరమని చెప్పి కేవలం 22 లక్షల మందికి రూ.17 వేల కోట్లు కేటాయించి రుణ మాఫీ చేశామని ప్రకటించడం శోచనీయమన్నారు. ఆధార్ కార్డు లింక్, అకౌంట్‌లో సాంకేతిక సమస్య, పట్టాదారు పాస్‌బుక్, పహానీ లేదని, ఆధార్, బ్యాంక్ అకౌంట్‌లో పేర్లు తప్పులు ఉండడంతో రుణ కాఫీ కావడంలేదని ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నచిన్న కారణాలతో రుణమాఫీ ఎగవేసేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని రైతు సంఘం ఎండగడుతుందని పేర్కొన్నారు. రైతులు పండించిన అన్ని పంటలకు షరతులు లేకుండా కింటాకు రూ.1,000 బోనస్ ఇవ్వాలని చందునాయక్ డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయడం సహా 2022 మార్చి, ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలు, వడగండ్లతో జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారంపై గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల వెంటనే నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

బచ్చన్నపేట, ఆగస్టు 19 : మండల కేంద్రంలోని ఫొటోగ్రాఫర్లు సోమవారం ఫొటోగ్రఫి దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు సూత్రమ రమేశ్ నేతృత్వంలో కెమరా సృష్టికర్త లూయిస్ జాక్విస్‌మాండేడాగూరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు మచ్చ సతీశ్, రాపెల్లి శాంతయ్య, రాపెల్లి సదానందం, శివ, నర్సింహులు, సిద్ధు పాల్గొన్నారు.

ఏఎస్సైని సన్మానిస్తున్న ఎస్సై నరేశ్‌యాదవ్

అంకితభావంతో

పనిచేస్తేనే గుర్తింపు : ఎస్సై

రఘునాథపల్లి ఆగస్టు 19: అంకితభావంతో విధులు నిర్వర్తిస్తేనే గుర్తింపు ఉంటుందని ఎస్సై దూదిమెట్ల నరేశ్ యాదవ్ అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తించిన ఉబేదుల్లా బదిలీపై ఎలుకుర్తి వెళ్తున్న సందర్భంగా ఎస్సై నరేశ్‌యాదవ్‌తో పాటు పోలీసుల సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఉబేదుల్లా అందరితో కలివిడిగా ఉంటూ నిబద్ధతతో పని చేసేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌కానిస్టేబుళ్లుశ్యామల శ్రీనివాస్, పోతుల శ్రీనివాస్, కానిస్టేబుల్స్ వీరన్న, యాకయ్య, భాస్కర్, నర్సయ్య పాల్గొన్నారు.

పెండింగ్ రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలి

వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీహరి

రైల్వే జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కడియం కావ్య, శ్రీహరి

జఫర్‌గడ్, ఆగస్టు 19 : వరంగల్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ కాడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతి పత్రాన్ని అందించారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని కాజీపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి లో భాగంగా అదనపు ప్లాట్‌ఫామ్స్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరారు. వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో ప్రజల రాకపోకల దృష్ట్యా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఎస్కలేటర్లతో కూడిన మరో రెండు ప్లాట్ ఫామ్స్ ఏర్పాటు చేయాలన్నారు. కాజీపేట టౌన్ స్టేషన్‌ను పూర్తి స్థాయి స్టాపింగ్ స్టేషన్‌గా మార్చాలని వారు కోరారు. రైల్వే సబ్ డివిజన్ హాస్పిటల్ అభివృద్ధి చేయాలని, అదనపు సిబ్బంది, సౌకర్యాలను నిపుణులైన వైద్యులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్, ఉద్యోగుల రిక్రియేషన్ క్లబ్ నూతన భవన ఏర్పాటుతో పాటు కమ్యూనిటీ భవన ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. స్టేషన్ ఘన్‌పూర్ రెవె న్యూ డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. నష్కల్ నుంచి హసన్‌పర్తి, నష్కల్ నుంచి చింతలపల్లి వరకు, వరంగల్ నగరం మీదుగా రైల్వే బైపాస్ లైన్‌ను నిర్మించడం వల్ల రైతులు నష్ట పోవడంతో పాటు పట్టణాభివృద్ధికి అడ్డంకిగా మారే ప్రమాదముందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా అలైన్‌మెంట్ లో మార్పు చేసి మరో మార్గం లో రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే సబ్ డివిజన్ హాస్పిటల్ ఏర్పాటుపై జీఎం అరుణ్‌కుమార్ సానుకూలంగా స్పందించి ఆసుపత్రి అభివృద్ధి పనుల కోసం రూ.1.75 కోట్లు మంజూరు చేశారని, త్వరలోనే ప్రారంభించనున్నట్లు కడియం కావ్య, శ్రీహరి ఈ సందర్భంగా తెలిపారు

రుణమాఫీ వినతుల స్వీకరణకు ప్రత్యేక అధికారులు : కలెక్టర్

జనగామ, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) : రైతుల రుణమాఫీపై వినతులు స్వీకరించేందుకు ప్రతి మండలంలో వ్యవసాయశాఖ అధికారిని నియమించినట్లు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. జనగామ మండలానికి కరుణాకర్-7288894739, బచ్చన్నపేటకు విద్యాకర్‌రెడ్డి-7288894741, నర్మెటకు సంతోషి-7288894742, తరిగొప్పులకు బీనా-7288894738, పాలకుర్తికి పరశురాం-7288894732, కొడకండ్లకు విజయ్‌రెడ్డి-7288894737, దేవరుప్పలకు సంతోష్- 8096116885, స్టేషన్‌ఘన్‌పూర్‌కు చంద్రన్ కుమార్-7288894727, చిల్పూర్‌కు వినయ్ కుమార్-8247637915, జఫర్‌గడ్‌కు శిరీష-7993368101, రఘునాథపల్లికి శ్రీనివాసరెడ్డి-7288894730, లింగాలఘనపూర్‌కు వెంకటేశ్వర్లు-7288894731 ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. జనగామ, రఘునాథపల్లి మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయాల్లో, మిగతా మండలాల్లోరైతు వేదికలో అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. ప్రతి రైతు సమస్యను పరిష్కరించే వరకు రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. నవాబుపేట, జనగామ కెనరా బ్యాంక్, జనగామ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో సాంకేతిక కారణాలతో రైతుల పేర్లు రుణమాఫీ లిస్టులో రాలేదని, దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపించామని తెలిపారు.

రుణమాఫీలో సమస్యలపై వినతుల స్వీకరణ

జఫర్‌గడ్ : రైతుల పంట రుణాల మాఫీలో సమస్యలపై వినతిపత్రాల స్వీకరణకు మండల స్థాయిలో ఏఈవో శిరీషాను నియమించినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. రుణాలు మాఫీ కాని వారు వివరాలతో అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

దగ్ధమవుతున్న వీధిదీపాల స్టాటర్

వీధిదీపాల ఆన్‌ఆఫ్ స్టాటర్ దగ్ధం

లింగాలఘనపురం, ఆగస్టు 19 : మండల కేంద్రంలో సోమవారం రాత్రి విద్యుత్ ప్రమాదం జరిగి వీధిదీపాల ఆన్ ఆఫ్ స్టాటర్ బాక్స్ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బోటిమీద కేమిడి యాదగిరి ఇంటి సమీపంలో విద్యుత్ తీగల్లో ఒక్కసారిగా మంటలు లేచాయి. దీంతో ఆన్‌ఆఫ్ స్టాటర్ బాక్స్ దగ్ధమైంది. సంబంధిత అధికారులు పరిశీలించిన దీనిని పునరుద్ధరించాలని స్థానికులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రఘునాథపల్లి, ఆగస్టు 19: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సఘటన మండలంలోని నిడిగొండ వద్ద హైదే సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిర్రు అనిల్‌కుమార్ బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. నిడిగొండ ఫ్లైఓర్ బ్రిడ్జి వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో జనగామ నుంచి హనుమకొండకు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న అనిల్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఎంపీ కడియం కావ్య ఘటనను గమనించి తన వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన ఎస్సై నరేశ్‌యాదవ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆబులెన్స్ ద్వారా బాధితుడిని దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్ ఆర్ ఎస్‌పై వీడియో కాన్ఫరెన్స్

వరంగల్, ఆగస్టు 19 : ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ సోమవారం హైదరాబాద్ నుంచి మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే బల్దియాలో చేపట్టిన అంశాలను వివరించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కరించేందుకు 3 విభాగాల అధికారులతో 12 బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాద్‌కర్, సీఎంహెచ్‌వో రాజేశ్, హెచ్‌వో రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా బుగులు వెంకన్న మాస కల్యాణం

వేంకటేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిల్పూరు, ఆగస్టు 19 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం సోమవారం సందర్భంగా స్వామివారం మాస కల్యాణం నిర్వహించారు. అర్చకులు ఉత్సవమూర్తులను అలంకరించి వేదమంత్రాలతో పూజలు చేశారు. స్వామివారి కల్యాణాన్ని భక్తులు కనుల పండుగగా తిలకించారు. రాఖీ పండుగ కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. హైదరాబాద్ వాస్తవ్యులు పేరి లక్ష్మీనారాయణ శర్మ, ప్రభావతిదేవి దంపతులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, ఆలయ ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, అర్చకులు సౌ మిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, వీరన్న, మ హేశ్, మల్లికార్జున్, విశాల్, శేఖర్ పాల్గొన్నారు

ప్రతి విద్యార్థి విజయం కోసం కృషి చేయాలి : నిట్ డైరెక్టర్

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 19 : ప్రతి విద్యార్థి విజయాల కోసం కృషి చేయాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. సోమవారం నిట్ ఆడిటోరియంలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన సుమారు 1100 మంది విద్యార్థులు ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. క్యాంపస్‌లో అందిస్తున్న సేవలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం డీన్లు, విభాగాధిపతులు, చీఫ్ వార్డెన్ విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఇన్‌స్టిట్యూట్ సౌకర్యాలు, విధానాలను విద్యార్థులకు పరిచయం చేయడానికి ఐదు రోజుల పాటు షెడ్యూల్ చేసిన ఇండక్షన్ ప్రోగ్రామ్ మంగళవారం నుంచి ప్రతిరోజూ సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. 22న ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) నేషనల్ ఇండక్షన్ డే 5.0 నిర్వహిస్తుందన్నారు.

సోమనాథ ఆలయంలో వేడుకలు నిర్వహిస్తున్న పద్మశాలీలు

ఘనంగా జంజిరాల పౌర్ణమి వేడుకలు

పాలకుర్తి రూరల్, ఆగస్టు 19 : జంజిరాల(నూలు పోగు పౌర్ణమి) వేడుకలను సోమవారం మండల కేంద్రంలో పద్మశాలీలు ఘనంగా నిర్వహించారు. భక్త మార్కండేయ మహర్షికి సమర్పించే పట్టు వస్త్రాలను పద్మశాలి సంఘం మండల ప్రధాన కార్యదర్శి పెనుగొండ రమేశ్ ఇంటి నుంచి పంచగుళ్ల వరకు బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా వెళ్లారు, అనంతరం అర్చకుడు గంగు రఘు శర్మ ఆధ్వర్యంలో మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, పద్మశాలి సంఘం నాయకులు చిదిరాల ఎల్లయ్య, కాటబత్తిని రమేశ్, డాక్టర్ మేడారపు సుధాకర్, చిలుకమారి నాగేశ్వర్, వరప్రసాద్, కూరపాటి సుదర్శన్, గజ్జెల్లి ల్యాబ్ వెంకన్న, ఈగ శ్రీనివాస్, సోమశేఖర్, పొన్నాల వీరయ్య, పెనుగొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రుణాలు మాఫీకాని వారు ఫిర్యాదు చేయొచ్చు

నర్మెట, ఆగస్టు 19 : పంట రుణాల మాఫీలో సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు సంబంధించి మాఫీ కాని విషయమై ఫిర్యాదులు చేయొచ్చని మండల వ్యవసాయ అధికారి సంతోషిని తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు